

తుది దశకు 'ఆడుదాం ఆంధ్రా'

'ఆడుదాం ఆంధ్రా' క్రీడా పోటీలు తుది దశకు చేరుకున్నాయి. గురువారం జిల్లా స్థాయి పోటీలు ప్రారంభం కానున్నాయి. 8లో



టమాట కిలో రూ.18

కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్ట ధర రూ.18 పలికింది. కనిష్టం రూ.6, సరాసరి రూ.12 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
34.9°/12.4°

జిల్లాలో బుధవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉదయం చలి వాతావరణం కొనసాగింది. ఆగ్నేయం దిశగా గాలులు గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

ఉచిత న్యాయ సేవలు వినియోగించుకోవాలి



అవగాహన కల్పిస్తున్న న్యాయమూర్తి

అనంతపురం: శాశ్వత లోక్ అదాలత్‌లో ఉచిత న్యాయ సేవలను వినియోగించుకోవాలని ఉమ్మడి జిల్లా ప్రజా ప్రయోజనాల శాశ్వత లోక్ అదాలత్ న్యాయమూర్తి కె.శ్రీనివాసరావు అన్నారు. బుధవారం నగరంలోని న్యాయ సేవా సదన్‌లో వివిధ ప్రజా ప్రయోజన సేవ శాఖల ప్రభుత్వ అధికారులకు కేసుల పరిష్కారంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా న్యాయమూర్తి కె.శ్రీనివాసరావు హాజరై మాట్లాడారు. ఇరు పక్షాల నడుమ సామరస్య పరిష్కారానికి సమాన అవకాశాలు ఇస్తూ, రాజీ కుదరని పక్షంలో ధర్మాసనం తీర్పు వెలువరిస్తుందన్నారు. ఇది అప్పీలు లేని శాశ్వత లోక్ అదాలత్ తీర్పు అవుతుందన్నారు. ప్రజా ప్రయోజనాల శాశ్వత లోక్ అదాలత్‌లో ఫిర్యాదు దాఖలు చేయడానికి కోర్టు రుసుము చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. కోటి రూపాయల పరిహారం వరకు వివాదాల పరిష్కారానికి తీర్పు వెలువరించగల అధికారం కలిగి ఉందన్నారు. శాశ్వత లోక్ అదాలత్ సభ్యులు ఎం.రాజశేఖర్‌రెడ్డి శాశ్వత లోక్ అదాలత్ గురించి వివరించారు. కార్యక్రమంలో న్యాయవాదులు, మునిసిపల్ కార్పొరేషన్, విద్యుత్ శాఖ, పోస్టల్, హౌసింగ్, డ్వామా, రోడ్లు, భవనాలు, ఎల్ఐసీ, ప్రభుత్వ ఆస్పత్రి, విద్యాశాఖ, ఆర్టీసీ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

కళ్యాణదుర్గం రూరల్: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో బుధవారం కలెక్టర్ గౌతమి కళ్యాణదుర్గం పట్టణంలోని వివిధ పోలింగ్ స్టేషన్లను పరిశీలించారు. స్ట్రాంగ్ రూమ్ వద్ద భద్రత ఏర్పాట్లు పక్కాగా ఉండాలని, ఇబ్బందులు తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీఓ రాణీ సుస్మిత, మున్సిపల్ కమిషనర్ నరసారెడ్డి, ఇన్‌చార్జ్ తహసీల్దార్ ఫణికుమార్, ఎన్నికల డీటీలు వెంకటేశులు, శ్రీనాథ్, ఎంపీడీఓ సాల్మన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన కల్పించండి


దిశ యాప్ గురించి విద్యార్థినులకు వివరిస్తున్న దృశ్యం

అనంతపురం: జిల్లా వ్యాప్తంగా విద్యార్థులకు నేరాలు- శిక్షలు, చట్టాలు తదితర అంశాలపై అవగాహన కల్పించాలని ఎస్పీ అన్బురాజన్ పోలీసు అధికారులను ఆదేశించారు. బుధవారం నుంచి విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ర్యాగింగ్ పాల్పడిన వారికి ఎలాంటి శిక్షలు పడతాయో వివరించారు. ర్యాగింగ్ జోలికెళితే అధోగతి పాలవుతారన్నారు. డ్రగ్స్, గంజాయి వంటి మాదక ద్రవ్యాలకు బానిసైతే జీవితం చిత్తు అవుతుందని హెచ్చరించారు. బాల్య వివాహాల చట్టం అమలు తీరుతెన్నులను వివరించారు. అమ్మాయిలకు ఆపద సమయంలో 'దిశ' యాప్ రక్షణ కవచంగా ఎలా దోహదపడుతుందో అవగాహన కల్పించారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డయల్-100, రోడ్డు ప్రమాదాలు, ఇలా పలు అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

మాతాశిశు మరణాలు నియంత్రించాలి


కలెక్టర్ గౌతమి

అనంతపురం అర్బన్: జిల్లాలో మాతృ, శిశు మరణాలు నియంత్రించాలని కలెక్టర్ గౌతమి అధికారులను ఆదేశించారు. మాతృ, శిశు మరణాలపై కలెక్టర్ బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో వైద్యారోగ్యశాఖ అధికారులతో సమీక్షించారు. గత ఏడాది జూలై నుంచి సెప్టెంబరు వరకు జిల్లాలో 3 మాతృమరణాలు, 3 శిశు మరణాలు చోటు చేసుకున్నాయన్నారు. మరణాలకు సంబంధించి ఎక్కడ తప్పు జరిగిందనే అంశంపై పరిశీలన జరపాలన్నారు. మరణాలు జరగకుండా క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. ఏఎన్ఎం, ఆశా వర్కర్లు, వైద్యాధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. సమావేశంలో డీఎంహెచ్ఓ భ్రమరాంబదేవి, ఎఫ్‌సీపీ నోడల్ అధికారి సుజాత, డీఐఓ యుగంధర్, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, వైద్యాధికారులు పాల్గొన్నారు.

అక్షర యజ్ఞం



- ప్రభుత్వ విద్యకు పూర్వ వైభవం
- జిల్లాలో చదువుల కోసం రూ.కోట్ల వ్యయం
- అమ్మ ఒడితో లక్షలాది మంది తల్లులకు ఆర్థిక భరోసా
- విద్యా కానుక, విద్యాదీవెనతో ఉత్సాహంగా పిల్లలు బడికి
- ఒక్క అమ్మఒడి ద్వారా తల్లుల ఖాతాలకు రూ.1718 కోట్లు జమ
- నాలుగేళ్లలో విద్యార్థుల కోసం రూ.2,446 కోట్లకు పైగా వ్యయం
- విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: పేద కుటుంబాల్లో పిల్లలను చదివించడం ఇదివరకు భారంగా ఉండేది. సంపాదన కుటుంబ పోషణకే సరిపోయేది. ఈ పరిస్థితుల్లో పిల్లలను బడులకు పంపించడం ఇబ్బందిగా ఉండేది. ఇలాంటి పరిస్థితిని అధిగమించాలంటే ప్రభుత్వాలే పూనుకోవాలి. ఇదే పని చేసింది ప్రస్తుత జగన్ సర్కారు. గడిచిన నాలుగేళ్లలో విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకున్నాయి. జిల్లా వ్యాప్తంగా అధ్వానస్థితిలో ఉన్న స్కూళ్లను బాగు చేయడం ఒకెత్తయితే.. అమ్మ ఒడి, విద్యా కానుక, వసతి దీవెన వంటి పథకాలతో లక్షలాది మంది విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు భరోసా ఇచ్చి బడికి పంపడానికి తోడ్పాటునందించింది. అంతేకాదు ప్రభుత్వ బడుల్లో ఆంగ్ల మాధ్యమంలో బోధన అమలు చేసింది. దీంతో తల్లిదండ్రులు తమ పిల్లలను పైసా ఖర్చు లేకుండా ఇంగ్లిష్ చదువులు చదివించేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు.

తల్లుల మోములో చిరునవ్వులు

జిల్లాలో లక్షలాదిమంది తల్లుల ముఖంలో చిరునవ్వులు కనిపిస్తున్నాయి. అమ్మ ఒడి పథకం కింద ఏటా క్రమం తప్పకుండా ఆర్థికసాయం మంజూరవుతోంది. దీంతో ప్రతి తల్లీ తమ బిడ్డలకు చదువు నేర్పించాలని పూనుకుంది. పిల్లలు చదువుకుంటేనే ఆ కుటుంబం బాగుపడుతుందని భావిస్తున్న తల్లుల వల్ల స్కూళ్లలో డ్రాపౌట్స్ గణనీయంగా తగ్గినట్టు గణాంకాలే చెబుతున్నాయి. ఏటా లక్షల మంది తల్లులు అమ్మ ఒడి పథకం వల్ల లబ్ధి పొందుతున్నారు.

ప్రతి ఒక్కరికీ చదువు అందాలనే...

ఒక్క అమ్మ ఒడి పథకమే కాదు.. పిల్లలు చదువుకోవాలనే ఉద్దేశంతో విద్యా దీవెన, వసతి దీవెన, విద్యా కానుక పథకాలతో ఎల్‌కేజీ నుంచి పీజీ వరకూ చదువుకునే ప్రతి విద్యార్థికీ లబ్ధి చేకూరుస్తోంది. జగనన్న విద్యా దీవెన కింద ఈ ఒక్క జిల్లాకే గడిచిన నాలుగేళ్లలో రూ.344 కోట్లు వెచ్చించారు. జగనన్న విద్యాకానుక కింద విద్యార్థులకు యూనిఫాం మొదలుకొని పుస్తకాల వరకు అన్నిటికీ కలిపి నాలుగేళ్లలో రూ.210 కోట్లు వెచ్చించారు. దీనివల్ల నిరుపేద కుటుంబంలో పుట్టిన పిల్లలు సైతం స్కూళ్లకు వెళ్లగలుగుతున్నారు. ఆర్థిక ఇబ్బందులతో చదువుకోలేకపోతున్నారనేది ఏ కుటుంబంలోనూ వినిపించకూడదన్నదే జగన్ సర్కారు లక్ష్యం. ఇందు కోసం కోట్లాది రూపాయలు వెచ్చిస్తోంది. గడిచిన నాలుగేళ్లలో పై నాలుగు పథకాల కింద రూ.2446.98 కోట్లు ఈ జిల్లాకే ఖర్చు చేశారు.

జిల్లాలో అమ్మ ఒడి పథకం ఇలా..

సంవత్సరం	లబ్ధిదారులు	వ్యయం (రూ.కోట్లలో)
తొలి ఏడాది	3,62,579	543.87
రెండో ఏడాది	3,81,559	572.34
మూడో ఏడాది	2,16,842	325.26
నాలుగో ఏడాది	2,13,394	277.41

జగనన్న విద్యా దీవెన

సంవత్సరం	లబ్ధిదారులు	వ్యయం (రూ.కోట్లలో)
2019-20	45,491	103.73
2020-21	50,571	83.78
2021-22	50,702	100.53
2022-23	42,915	56.35

జగనన్న విద్యా కానుక

సంవత్సరం	లబ్ధిదారులు	వ్యయం (రూ.కోట్లలో)
2019-20	2,22,811	34.09
2020-21	2,27,180	37.92
2021-22	2,34,671	46.93
2022-23	2,40,096	39.35
2023-24	2,25,688	51.95

జగనన్న వసతి దీవెన...

సంవత్సరం	లబ్ధిదారులు	వ్యయం (రూ.కోట్లలో)
2019-20	43,759	42.37
2020-21	49,597	47.96
2021-22	48,295	45.25
2022-23	41,115	37.46

'వసతి దీవెన' వరం



గుత్తి గేట్స్ కాలేజీలో ఇంజినీరింగ్ చదువుతున్నాను. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న వసతి దీవెన పథకం మాలాంటి పేద పిల్లలకు వరంగా మారింది. డిగ్రీ, పీజీ చదివే విద్యార్థులకైతే ఏటా రూ.20 వేల నగదు రెండు విడతలుగా నేరుగా తల్లుల ఖాతాలకే జమచేస్తోంది. ఈ డబ్బు.. అవసరాలకు ఎంతగానో ఉపయోగపడుతోంది. అత్యవసర పరిస్థితుల్లో తోడుగా నిలిచిన ప్రభుత్వాన్ని విద్యార్థులు ఎన్నటికీ మరచిపోలేరు.

–ఆత్మకూరు మహమ్మద్ సాదిక్, రాయదుర్గం

బిడ్డ చదువుకు ఢోకా లేదు



నా కూతురు శర్వాణి లక్ష్మి. మా ఊరు ముప్పలకుంటలోని ప్రభుత్వ మండల పరిషత్ పాఠశాలలో 4వ తరగతి చదువుతోంది. గత నాలుగేళ్లుగా ప్రభుత్వం నుంచి అమ్మ ఒడి పథకం కింద నా బ్యాంకు అకౌంట్లోకి డబ్బులు వేస్తోంది. నా బిడ్డ చదువుకు ఎలాంటి ఢోకా లేదు. జగనన్నే మా పిల్లల చదువు బాధ్యత తీసుకున్నారు. చాలా సంతోషంగా ఉంది.

– భాగ్యమ్మ, ముప్పలకుంట, బ్రహ్మసముద్రం మండలం

సంతోషంగా స్కూలుకు..



నేను ఉరవకొండలోని ఎస్‌కే ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నా. జగన్ మామయ్య చలువతో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులందరికీ విద్యా కానుక కింద యూనిఫాం, షూ అన్నీ ఉచితంగా ఇచ్చారు. కార్పొరేట్ స్కూలులో చదువుతున్న ఫీలింగ్ కలుగుతోంది. చాలా సంతోషంగా ఉంది.

– హర్షిత, ఉరవకొండ

మేమూ మంచి మార్కులు సాధిస్తాం



నేను ఉరవకొండలోని ఎస్‌కే ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాను. ఇక్కడ ఇంగ్లిష్ మీడియం అమలు చేస్తున్నారు. జగనన్న మా కోసం చాలా మంచి పనులు చేస్తున్నారు. ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోటుపుస్తకాలు, యూనిఫాం, షూ, టై, బెల్టు అందిస్తున్నారు. స్కూలులో సౌకర్యాలు కూడా కల్పించారు. ఉపాధ్యాయులు కూడా అద్భుతంగా పాఠాలు చెబుతున్నారు. మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధిస్తానన్న నమ్మకం ఉంది.

– లక్ష్మీనారాయణ, ఉరవకొండ

థ్యాంక్యూ జగన్ మామ



మా అమ్మ శ్రీలక్ష్మి వ్యవసాయ కూలీ. నాన్న కృష్ణ బేల్దారి. పైసా ఖర్చు లేకుండా సీఎం జగన్ మోహన్‌రెడ్డి మాలాంటి పేద పిల్లలకు ఉచితంగా చదివిస్తున్నారు. పాఠశాల తెరిచిన రోజే స్కూల్‌బ్యాగ్, పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, షూలు, సాక్సులు, యూనిఫామ్, బెల్టు, డిక్షనరీతో కూడిన విద్యా కానుక కిట్ అందిస్తున్నారు. ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

– వి.భవాని, పదో తరగతి, రాజేంద్రప్రసాద్ మున్సిపల్ హైస్కూల్, గుంతకల్లు

విద్యా కానుకతో ఆర్థిక ఉపశమనం



జగనన్న ముఖ్యమంత్రి అయ్యాక ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారాయి. 'నాడు- నేడు' కింద మా గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సౌకర్యాలు మెరుగుపరిచారు. జగనన్న విద్యా కానుక ద్వారా తల్లిదండ్రులకు ఆర్థికభారం తగ్గించారు. కొత్త మెనూతో మధ్యాహ్న భోజనం కూడా ఎంతో రుచికరంగా ఉంటోంది. రోజూ రాగి జావ ఇస్తున్నారు.

– కావేరి, 9వ తరగతి, వైటీ చెరువు, గుంతకల్లు మండలం

ఇంటర్ ప్రాక్టికల్స్‌కు సిద్ధం

- ఈ నెల 11 నుంచి ప్రయోగ పరీక్షలు
- జిల్లాలో 70 కేంద్రాల ఏర్పాటు
- హాజరుకానున్న 12,845 మంది విద్యార్థులు
- రెండు విడతలుగా నిర్వహణ
- తొలిసారిగా ప్రాక్టికల్ మార్కులు ఆన్‌లైన్‌లో నమోదు

అనంతపురం ఎడ్యుకేషన్: ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షల నిర్వహణకు రంగం సిద్ధమైంది. ఈ నెల 11 నుంచి 20 వరకు జరిగే ఈ పరీక్షలకు జిల్లాలో 12,845 మంది ఫిజిక్స్, జువాలజీ, కెమిస్ట్రీ, బాటనీ విద్యార్థులు హాజరుకానున్నారు. ఇందుకోసం 70 కేంద్రాలు ఏర్పాటు చేశారు. పరీక్షల నిర్వహణ ఏర్పాట్లను ఇంటర్ బోర్డు అధికారులు చకాచకా చేస్తున్నారు. రెండు విడతలుగా ప్రయోగ పరీక్షలు జరగనున్నాయి. తొలివిడత ఈ నెల 11 నుంచి 15 వరకు, రెండో విడత 16 నుంచి 20వ తేదీ వరకు జరుగుతాయి. గతంలో ప్రాక్టికల్ పరీక్ష ముగిసిన వెంటనే ఆఫ్‌లైన్‌లో మార్కులు వేసి వాటిని బండిళ్లలో భద్రపరిచి బోర్డుకు పంపేవారు. అయితే ప్రప్రథమంగా ఈ ఏడాది ఆన్‌లైన్‌లో మార్కులు నమోదు చేసేలా బోర్డు కొత్త విధానానికి శ్రీకారం చుట్టింది. పరీక్ష ముగిసిన వెంటనే ఎగ్జామినర్లు అదేరోజు ఆన్‌లైన్‌లో మార్కులు నమోదు చేయాల్సి ఉంటుంది.

ఎగ్జామినర్లకు పోస్టల్ ద్వారా ఉత్తర్వులు


ఆయా కేంద్రాలకు ఎగ్జామినర్లను బోర్డు అధికారులు నేరుగా నియమించారు. ప్రభుత్వ కళాశాలల్లో పని చేసే వారికి కనీసం రెండేళ్లు, ప్రైవేట్ కళాశాలల్లో పని చేసేవారికి కనీసం మూడేళ్ల అనుభవం అర్హతగా పరిగణనలోకి తీసుకున్నారు. అన్ని యాజమాన్యాల కింద పని చేస్తున్న కళాశాలల నుంచి అధ్యాపకులను తీసుకున్నారు. ఎవరిని కూడా తను పని చేస్తున్న కళాశాలలో ఎగ్జామినర్‌గా నియమించరు. నియామక ఉత్తర్వులను ఇంటర్మీడియెట్ బోర్డు అధికారులు నేరుగా పోస్టల్ ద్వారా పంపనున్నారు. ఎగ్జామినర్లను మూడు రోజులకోసారి మార్చుతారు. ఒకసారి నియమించిన వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ తిరిగి నియమించరు. ప్రైవేట్ కళాశాలలు కేంద్రాలుగా ఉన్నవాటికి డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లను నియమించనున్నారు.


ప్రయోగ తరగతిలో విద్యార్థులు

పర్యవేక్షణకు ప్రత్యేక బృందాలు

పరీక్షల నిర్వహణకు ప్రత్యేక బృందాలను నియమించారు. జిల్లా పరీక్షల కమిటీ (డీఈసీ) కన్వీనర్, డీవీఈఓ వెంకటరమణనాయక్‌తో పాటు మెంబర్లు శంకరయ్య (ఆత్మకూరు ప్రిన్సిపాల్), మహమ్మద్ షఫీ (శింగనమల ప్రిన్సిపాల్), జగన్నాథ్ (కళ్యాణదుర్గం ప్రిన్సిపాల్), వెంకటేశ్వర ప్రసాద్ (ఒకేషనల్ జూనియర్ కళాశాల- అనంతపురం ప్రిన్సిపాల్) పర్యవేక్షిస్తారు. ఇద్దరు సభ్యులను ఫ్లయింగ్ స్క్వాడ్‌గా నియమించారు. వీరిలో ఒకరు విద్య, మరొకరు రెవెన్యూ శాఖ నుంచి ఉంటారు. వీరే కాకుండా జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్లు, డీఆర్వో, ఆర్డీఓలతో పాటు కేంద్రాలున్న ప్రాంతాల తహసీల్దార్లు కూడా పర్యవేక్షిస్తారు.

ఏర్పాట్లు చేస్తున్నాం



జిల్లాలో ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లూ చేస్తున్నాం. విద్యార్థులకు ఎటువంటి సమస్యా ఉత్పన్నం కాకుండా చర్యలు తీసుకుంటున్నాం. తొలిసారిగా పరీక్షలు అయిపోయిన వెంటనే సంబంధిత ఎగ్జామినర్లు మార్కులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. హాల్‌టికెట్ల విషయమై ఒకట్రెండు రోజుల్లో ఆదేశాలు రానున్నాయి.

– వెంకటరమణనాయక్, జిల్లా వృత్తి విద్యాశాఖ అధికారి

డీఆర్ఓగా రామకృష్ణారెడ్డి

అనంతపురం అర్బన్: ఎన్నికల నేపథ్యంలో రాజంపేట ఆర్డీఓ రామకృష్ణారెడ్డిని అనంతపురం జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్ఓ)గా ప్రభుత్వం నియమించింది. ఇక్కడి డీఆర్ఓ గాయత్రీదేవిని బదిలీ చేస్తూ సాధారణ పరిపాలన విభాగంలో రిపోర్టు చేసుకోవాలని బుధవారం జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది.

డిప్యూటీ కలెక్టర్ల బదిలీ ఇలా

ఉమ్మడి అనంతపురం జిల్లాకు డిప్యూటీ కలెక్టర్లను ప్రభుత్వం బదిలీ చేస్తూ పోస్టింగ్ ఇచ్చింది. ధర్మవరం ఆర్డీఓగా శివరామిరెడ్డిని నియమించారు. ఇక్కడ ఉన్న రమేష్‌రెడ్డిని సీసీఎల్ఏలో రిపోర్ట్ చేసుకోవాలని ఆదేశించారు. కోనేరు రంగరావు కమిటీ (కేఆర్ఆర్‌సీ) డిప్యూటీ కలెక్టర్‌గా జె.శిరీషను నియమించారు. పీఏబీఆర్ ఎస్‌డీసీగా రాంభూపాల్‌రెడ్డిని, అహుడా కార్యదర్శిగా గౌరీశంకర్‌ను నియమించారు.

62 మంది తహసీల్దార్లు బదిలీ

ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి 62 మంది తహసీల్దార్లను ఇతర జిల్లాలకు బదిలీ చేశారు. అదే విధంగా ఇతర జిల్లాకు చెందిన 62 మంది తహసీల్దార్లను ఉమ్మడి అనంతపురం జిల్లాకు బదిలీ చేశారు. ఇక ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం జిల్లాలో మూడేళ్ల సర్వీసు పూర్తి కాని ఏడుగురు తహసీల్దార్లు, అదే విధంగా 2024 జూన్ 30 నాటికి ఉద్యోగ విమరణ చేయనున్న ఐదురుగు తహసీల్దార్లకు బదిలీ నుంచి మినహాయింపు ఇచ్చారు. అయితే వీరిని ఎన్నికల విధులకు దూరంగా ఉంచాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఏటీవీఎంతో అన్ రిజర్వేషన్ టికెట్లు

గుంతకల్లు: రైల్వే జనరల్ ప్రయాణికులు ఆటోమేటిక్ టికెట్ వెండింగ్ మెషిన్ (ఏటీవీఎం) ద్వారా అన్ రిజర్వేషన్ టికెట్లు కొనుగోలు చేయొచ్చని రైల్వే సీనియర్ డీసీఎం మనోజ్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సాధారణంగా జనరల్ టికెట్ కోసం ప్రయాణికులు హడావుడిగా రైల్వేస్టేషన్‌కు చేరుకుని, భారీ క్యూలైన్‌లో నిలబడి, టికెట్ తీసుకునేలోపు రైలు వెళ్లిపోతుందేమోనని హైరానా పడిపోతుంటారన్నారు. ఈ ఇబ్బందులకు చెక్ పెడుతూ డిజిటల్ టెక్నాలజీ ప్రోత్సాహంలో భాగంగా రైల్వే శాఖ నాలుగేళ్ల క్రితం అన్ రిజర్వ్‌డ్ టికెటింగ్ సిస్టమ్ (యూటీఎస్) ప్రవేశపెట్టిందన్నారు. అదే విధంగా ఏటీవీఎంలను కూడా అందుబాటులోకి తెచ్చిందని తెలిపారు. ఇప్పటికే ఉన్న ఫీచర్లతో పాటు యూటీఎస్ మొబైల్ యాప్‌కు వర్తించే మూడు శాతం బోనస్ ఇప్పుడు ఏటీవీఎమ్ ద్వారా టికెట్ల కొనుగోలుకు వర్తింపజేసినట్లు వెల్లడించారు. యూటీఎస్ యాప్‌లో రైల్వే వ్యాలెట్ (ఆర్-వ్యాలెట్)ను ఉపయోగించవచ్చని, వ్యాలెట్‌కు ప్రతి రీచార్జ్‌పై మూడు శాతం బోనస్ కూడా పొందవచ్చన్నారు. వినియోగదారులకు మొబైల్ యాప్‌లో ప్రింటెడ్ టికెట్ ఆప్షన్ కూడా వినియోగించవచ్చన్నారు. వీటిని బుకింగ్ కౌంటర్లు లేదా స్టేషన్ ఆవరణలో అందుబాటులో ఉన్న ఏటీవీఎంలో మొబైల్ నంబర్‌తో పాటు బుకింగ్ కోడ్ ఎంటర్ చేసిన తర్వాత ప్రింట్ వస్తుందన్నారు. డిజిటల్ పద్ధతిలో టికెట్ల కొనుగోలు వృద్ధికి తీసుకుంటున్న చర్యలు మంచి ఫలితాలు ఇస్తున్నాయని తెలిపారు.

క్లుప్తంగా

గోదాముల నిర్మాణం వేగవంతం చేయండి

- అధికారులకు జేసీ కేతన్‌గార్గ్ ఆదేశం



అధికారులతో సమీక్షిస్తున్న జేసీ కేతన్‌గార్గ్

అనంతపురం అర్బన్: జిల్లాలో మల్టీ పర్పస్ ఫెసిలిటీ సెంటర్ (ఎంపీఎఫ్‌సీ) గోదాముల నిర్మాణం త్వరితగతిన పూర్తిచేయాలని సంబంధిత అధికారులను జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్ ఆదేశించారు. గోదాముల నిర్మాణ పురోగతిపై బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో అధికారులతో ఆయన సమీక్షించారు. తొలి దశలో 102 ఎంపీఎఫ్‌సీ గోదాములు మంజూరు కాగా, ఇప్పటి వరకూ 24 నిర్మాణాలు పూర్తయ్యాయన్నారు. ఫిబ్రవరి ఆఖరు నాటికి మరో 30, మిగిలినవన్నీ మార్చి నెలాఖరు లోపు నిర్మాణం పూర్తి చేయాలని ఆదేశించారు. నిర్మాణాలకు సంబంధించి పెండింగ్ బిల్లులు ఏవైనా ఉంటే వెంటనే మంజూరు చేయాలన్నారు. నిర్మాణం పూర్తయిన గోదాములను వ్యవసాయ సహకార సంఘాలకు అప్పగించాలన్నారు. సమావేశంలో డీసీఓ ప్రభాకరరెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ, నాబార్డ్ డీడీఎం అనురాధ, ఉద్యాన శాఖ డీడీ రఘునాథరెడ్డి, మార్కెటింగ్ ఏడీ చౌదరి, డీసీసీబీ సీఈఓ రాంప్రసాద్ పాల్గొన్నారు.

అనంతకు చేరుకున్న 30 మంది ఎంపీడీఓలు

అనంతపురం సిటీ: కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలకనుగుణంగా బదిలీ అయిన ఎంపీడీఓల్లో 30 మంది బుధవారం అనంతపురానికి చేరుకుని జిల్లాపరిషత్ కార్యాలయంలో రిపోర్ట్ చేసుకున్నారు. కర్నూలు జిల్లా నుంచి 35 మంది ఎంపీడీఓలను అనంతపురానికి బదిలీ చేయగా, వీరిలో ఒకరు మరణించారు. మిగిలిన 34 మందిలో 30 మంది జెడ్పీలో రిపోర్ట్ చేసుకున్నారు. నెల్లూరు నుంచి ఓ ఎంపీడీఓ రావాల్సి ఉంది. ఒకట్రెండు రోజుల్లో మిగిలిన ఎంపీడీఓలు కూడా ఇక్కడికి వచ్చి రిపోర్ట్ చేసుకోనున్నారు. అనంతరం వారికి మండలాలు కేటాయిస్తూ సిద్ధం చేసిన జాబితాను కలెక్టర్ ఆమోదం కోసం పంపనున్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జాబితాలో మార్పులు చేర్పులు ఉంటాయి. అలాగే ఉమ్మడి జిల్లా నుంచి ఉమ్మడి వైఎస్సార్, కర్నూలు జిల్లాలకు బదిలీ అయిన 38 మంది ఎంపీడీఓలు మంగళవారం రాత్రి రిలీవ్ అయ్యారు.

‘వాల్టా’ పరిధిలోకి 48 గ్రామాలు

- ‘అనంత’లో 6, శ్రీసత్యసాయి జిల్లాలో అత్యధికంగా 42 గ్రామాలు

అనంతపురం అగ్రికల్చర్: వాటర్, ల్యాండ్ అండ్ ట్రీ యాక్ట్ (వాల్టా) పరిధిలో ఉమ్మడి జిల్లాలోని 48 గ్రామ పంచాయతీలను నోటిఫై చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు పంచాయతీ రాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రాజశేఖర్ మంగళవారం ఉత్తర్వులు ఇచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా ఏడు జిల్లాల పరిధిలో 188 గ్రామాలను వాల్టా పరిధిలోకి తెచ్చారు. ఇందులో అత్యధికంగా ప్రకాశం జిల్లాలో 57 గ్రామాలు, రెండో స్థానంలో శ్రీకాకుళం జిల్లాలో 53 గ్రామాలు, మూడో స్థానంలో శ్రీసత్యసాయి జిల్లాలో 42 గ్రామాలు ఉన్నాయి. అలాగే పల్నాడులో 16, వైయస్సార్ జిల్లాలో 13, అనంతపురం జిల్లాలో ఆరు, చిత్తూరులో ఓ గ్రామం వాల్టా పరిధిలోకి తెచ్చారు. మిగిలిన 19 జిల్లాల్లో ఓ గ్రామం కూడా లేకపోవడం విశేషం.



ఉమ్మడి జిల్లాలో ఇలా...

అనంతపురం జిల్లాలో పుట్లూరు మండలం కోమటికుంట్ల, మడుగుపల్లి, యల్లనూరు మండలం అరవేడు, బొప్పేపల్లి, పెద్దమల్లేపల్లి, తిరుమలాపురం గ్రామాలు ఉన్నాయి. శ్రీసత్యసాయి జిల్లాకు సంబంధించి అగళి మండలం హులికెరదేవరహళ్లి, మధుడి, నరసంబుది, పి.బేడిగిర, అమడుగూరు మండలంలో కరినిరెడ్డిపల్లి, లోకాజిపల్లి, చిలమత్తూరు మండలం హస్సేనాపురం, గాండ్లపెంట మండలం చామచేనుబైలు, చామలగొంది, గాండ్లపెంట, జీనులకుంట, కురుమామిడి, మడుగువానిగొంది, సోమయాజులపల్లి, గుడిబండ మండలం గునిమోరుబాగల్, కేకతి, ఎస్.రాయపురం, హిందూపురం మండలంలో దేవరపల్లి, గొల్లాపురం, కిరికెర, కొటిపి, కొట్నూరు, మనేసముద్రం, శ్రీకంఠపురం, ఎన్‌పీ కుంట మండలంలో ఎదురుదోన, గూటిబైలు, ముదుపాలజూవి, రొద్దం మండలంలో చెరుకూరు, రొళ్ల మండలంలో బొమ్మగుండనహళ్లి, దొడ్డేరి, కాకి, ఎం.రాయపురం, రొళ్ల, తనకల్లు మండలంలో అగ్రహారంపల్లి, బాలసముద్రం, బొంతలపల్లి, చీకటిమానిపల్లి, దిగువమండలపల్లి, గుర్రంబైలు, కోటపల్లి, మద్దినాయనపాలెం, టి.సదుం గామాలున్నాయి. ఈ గ్రామాల్లో మోతాదుకు మించి భూగర్భ జలాలు వినియోగిస్తున్నట్లు గుర్తించారు. తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకూ ఈ గ్రామాల పరిధిలో బోరు బావుల తవ్వకాన్ని నిషేధిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అవసరం అయితే అనుమతులు తీసుకుని తాగునీటికి మాత్రమే బోరు బావుల తవ్వకం చేసుకునే వెసులుబాటు ఉంటుందని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

తుది దశకు ‘ఆడుదాం ఆంధ్రా’

- నేటి నుంచి జిల్లా స్థాయి పోటీలు

అనంతపురం: దేశంలోనే తొలిసారిగా పెద్ద ఎత్తున యువతను భాగస్వామ్యం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ‘ఆడుదాం ఆంధ్రా’ జిల్లా స్థాయి క్రీడా పోటీలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా రూ.100 కోట్ల బడ్జెట్‌తో ఈ పోటీలు నిర్వహిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 1,33,670 మంది క్రీడాకారులు పేర్లు నమోదు చేసుకోగా, 136 మైదానాల్లో 4,800 మ్యాచ్‌లు జరిగాయి.

గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు టోర్నీలు

గత ఏడాది డిసెంబర్ 26న సచివాలయ పరిధిలో 15 రోజుల పాటు ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు జరిగాయి. గత నెల 10 నుంచి 23వ తేదీ వరకూ 14 రోజుల పాటు మండల స్థాయిలో, జనవరి 24 నుంచి 30వ తేదీ వరకు 7 రోజుల పాటు నియోజకవర్గ స్థాయిలో పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ చాటుకున్న క్రీడాకారులను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈ నెల 1వ తేదీ నుంచి 6వ తేదీ వరకూ ఆరు రోజుల పాటు జిల్లా స్థాయి పోటీలు జరుగనున్నాయి. జిల్లా స్థాయిలో ప్రతిభ చాటిన క్రీడాకారులతో తుది జట్లను ఎంపిక చేసి ఈ నెల 6 నుంచి 10వ తేదీ వరకూ జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు పంపనున్నారు. మొత్తంగా ఆదివారాలు, పండుగలు మినహాయించి 47 రోజుల పాటు టోర్నీ జరగనుంది.

ఖోఖో, క్రికెట్, వాలీబాల్, కబడ్డీ పోటీలలో విజేత జట్లకు అందించే నగదు పురస్కారం

స్థానం	నియోజకవర్గం	జిల్లా స్థాయి	రాష్ట్ర స్థాయిలో
ప్రథమ	రూ.35 వేలు	రూ.60 వేలు	రూ.5 లక్షలు
ద్వితీయ	రూ.15 వేలు	రూ.30 వేలు	రూ.3 లక్షలు
తృతీయ	రూ.5 వేలు	రూ10 వేలు	రూ.2 లక్షలు

బ్యాడ్మింటన్ డబుల్స్ విజేతలకు అందించే నగదు పురస్కారం

స్థానం	నియోజకవర్గం	జిల్లా స్థాయిలో	రాష్ట్ర స్థాయిలో
ప్రథమ	రూ.20 వేలు	రూ.35 వేలు	రూ.2 లక్షలు
ద్వితీయ	రూ.10 వేలు	రూ.20 వేలు	రూ.ఒక లక్ష
తృతీయ	రూ.5 వేలు	రూ.10 వేలు	రూ.50 వేలు

అర్హులైన జర్నలిస్టులకు అనువైన చోట ఇళ్ల స్థలాలు

అనంతపురం అర్బన్: ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హులైన జర్నలిస్టులందరికీ అనువైన చోట ఇళ్ల స్థలాలు మంజూరుకు చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ గౌతమి స్పష్టం చేశారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల అంశంపై కలెక్టర్ బుధవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, డీఆర్‌ఓ గాయత్రీదేవితో కలిసి జర్నలిస్ట్ హౌసింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు మంజూరుపై ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేస్తామన్నారు. ఇంటి స్థలం కోసం జిల్లాలో 335 మంది జర్నలిస్టులు దరఖాస్తు చేసుకున్నారన్నారు. ఇందుకు సంబంధించిన జాబితా సమాచార శాఖ కమిషనర్ కార్యాలయం నుంచి అందిందన్నారు. ఇంటి స్థలం పొందేందుకు అర్హులైన జర్నలిస్టులు రెవెన్యూ డివిజన్ వారీగా ఎందరున్నారు.. వారికి ఎంత మేర స్థలం అవసరం అవుతుంది.. ఏయే ప్రాంతాల్లో ప్రభుత్వ స్థలం ఉంది.. ప్రైవేటు స్థలం ఎక్కడ సేకరించాల్సి వస్తుంది.. తదితర అంశాలపై యుద్ధప్రాతిపదికన పరిశీలన పూర్తి చేస్తామన్నారు. ఇందుకు సంబంధించి అనంతపురం, గుంతకల్లు, కళ్యాణదుర్గం ఆర్డీఓలకు ఆదేశాలు ఇచ్చామన్నారు. సమగ్ర వివరాలతో నివేదికను వెంటనే సమర్పించాలని ఆదేశించారు. ఇదే అంశంపై మరో వారం రోజుల్లో మలి విడత సమావేశం నిర్వహిస్తామన్నారు. సమావేశంలో ఆర్డీఓలు గ్రంధి వెంకటేష్, రాణీ సుస్మిత, డీపీఆర్‌ఓ గురుస్వామిశెట్టి పాల్గొన్నారు.



జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు అంశంపై సమీక్షిస్తున్న కలెక్టర్ గౌతమి

అందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఐదేళ్ల అనుభవం ఉన్న జర్నలిస్టులందరికీ ఇంటి స్థలం మంజూరుకు చర్యలు తీసుకోవాలని హౌసింగ్ కమిటీ సభ్యులు రామచంద్రారెడ్డి, భోగేశ్వరరెడ్డి, శ్రీనివాసులు కోరారు. ఐదేళ్లకు మించి అనుభవం ఉన్నప్పటికీ కొందరికి అక్రిడిటేషన్ మంజూరు కాలేదన్నారు. అర్హత ఉండీ అక్రిడిటేషన్ లేని జర్నలిస్టులకూ ఇంటి స్థలం మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

డ్రిప్ మంజూరు వేగవంతం చేయాలి

- ఏపీఎంఐపీ ఓఎస్‌డీ వెంకటేశ్వర్లు ఆదేశం

అనంతపురం అగ్రికల్చర్: ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఏ మాత్రం అలసత్వం వహించకుండా నిర్దేశిత డ్రిప్, స్ప్రింక్లర్ల (బిందు, తుంపర) యూనిట్ల మంజూరు ప్రక్రియ మరింత వేగవంతం చేయాలని ఏపీఎంఐపీ ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ (ఓఎస్‌డీ) వెంకటేశ్వర్లు ఆదేశించారు. బుధవారం అనంతపురంలోని ప్రాంతీయ ఉద్యాన శిక్షణ కేంద్రంలో అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల పీడీలు జి.ఫిరోజ్‌ఖాన్, సుదర్శన్, ఏపీడీ ఫజులున్నీసాబేగం, ఉద్యానశాఖ డీడీ బి.రఘునాథరెడ్డితో కలిసి ఎంఐ ఇంజినీర్లు, డ్రిప్ కంపెనీ ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతపురం జిల్లాలో 12,500 హెక్టార్లకుగాను ప్రస్తుతానికి 9,577 మంది రైతులకు 11,706 హెక్టార్లకు సూక్ష్మసాగు పరికరాలు మంజూరు చేయడంతో ప్రస్తుతానికి రాష్ట్రంలోనే తొలి స్థానంలో ఉందన్నారు. ఇంకా 800 హెక్టార్ల వరకు ఉన్నందున వారం పది రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. ఇక శ్రీసత్యసాయి జిల్లా లక్ష్యం 10 వేల హెక్టార్లు కాగా ప్రస్తుతానికి 6,170 మంది రైతులకు 7,190 హెక్టార్లకు మంజూరు చేయడంతో ప్రస్తుతం రాష్ట్రంలో ఐదో స్థానంలో ఉందన్నారు. ఇక రోజువారీ ప్రణాళికతో ప్రాథమిక, తుది పరిశీలన, బీటక్యూ, బీఎంఎస్, మంజూరు, ఇన్‌స్టలేషన్, ట్రయల్ రన్, రైతుల నుంచి కన్‌ఫర్మేషన్ లెటర్లు తదితర ప్రక్రియ మరింత చురుగ్గా కొనసాగించాలని ఆదేశించారు. మంజూరు చేసిన రైతులకు వెంటనే పరికరాలను సరఫరా చేయాలని కంపెనీలను ఆదేశించారు. పరికరాల మంజూరులో నాణ్యతకు పెద్దపీట వేయాలని, ఐఎస్‌ఐ మార్కుతో ఇన్‌వాయిస్ ఆధారంగా అన్ని రకాల పరికరాలు వచ్చినట్లు రైతుల నుంచి ధ్రువీకరణ పత్రం తీసుకోవాలని సూచించారు.



మాట్లాడుతున్న ఏపీఎంఐపీ ఓఎస్‌డీ వెంకటేశ్వర్లు, చిత్రంలో రెండు జిల్లాల పీడీలు, డీడీ హెచ్

కాపు వ్యాఖ్యలు సరికాదు

- వైఎస్సార్‌సీపీ నేతల హితవు

రాయదుర్గం: ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి వ్యాఖ్యలు సరికాదని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, నియోజకవర్గ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి, పార్టీ పరిశీలకుడు పామిడి వీరాంజినేయులు అన్నారు. బుధవారం వారు రాయదుర్గంలోని మెట్టు నివాసంలో విలేకరులతో మాట్లాడారు. రాయదుర్గం అభివృద్ధి విషయంలో సీఎం జగన్ సహకారం లేదన్నట్లుగా కాపు వ్యాఖ్యానించడం తగదన్నారు. సీఎం సహకారంతోనే అభివృద్ధి సాధ్యమైందని పలు సందర్భాల్లో కాపు చెప్పారని, ఇప్పుడు టికెట్ లేదనేసరికి మాట మారుస్తున్నారని విమర్శించారు. ఆయన రాజకీయాల్లో ఈ స్థాయికి వచ్చారంటే వైఎస్ కుటుంబం చలువేనన్నారు. మునిసిపల్ కౌన్సిల్ సమావేశంలో చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప వైపు వేలుచూపుతూ బెదిరించిన తీరు సరికాదన్నారు. జగన్‌ను సీఎంగా మరోమారు చేసుకోవాలనే ఆత్రుత ప్రజల్లో కన్పిస్తోందని, కార్యకర్తలకు అండగా ఉంటూ పార్టీ విజయానికి పాటుపడతామని మెట్టు అన్నారు. సమావేశంలో మునిసిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, వైస్ చైర్మన్ వలీబాష, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రారెడ్డి, పట్టణ కన్వీనర్ అరవ శివప్ప, పార్టీ నాయకులు పొరాళ్ల శివ, పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న పైలా.. చిత్రంలో మెట్టు, వీరా తదితరులు

కౌన్సిలర్‌పై క్రమశిక్షణ చర్యలు

రెండు రోజుల క్రితం ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ పట్ల అభ్యంతరకరంగా ప్రవర్తించిన కౌన్సిలర్ డిష్ గోవింద్‌పై క్రమశిక్షణ చర్యలు చేపట్టేలా పార్టీ కేంద్ర కార్యాలయానికి నివేదిక పంపామని పైలా నరసింహయ్య తెలిపారు. పార్టీలో మహిళలంటే ఎంతో గౌరవం ఉంటుందని, అలాంటి చోట క్రమశిక్షణ తప్పి ప్రవర్తిస్తే ఎవరినైనా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. కౌన్సిలర్‌పై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కేసు కూడా నమోదు చేయించామన్నారు.

వినూత్న ఆవిష్కరణలతో శాస్త్రవేత్తలుగా ఎదగాలి

- అటల్ ల్యాబ్ హబ్ వర్క్‌షాపు ముగింపులో డీఈఓ నాగరాజు

అనంతపురం ఎడ్యుకేషన్: విద్యార్థి దశలోనే సైన్స్ పట్ల ఆసక్తి పెంచుకుని వినూత్న ఆవిష్కరణలతో శాస్త్రవేత్తలుగా ఎదగాలని విద్యార్థులకు జిల్లా విద్యాశాఖ అధికారి వి.నాగరాజు పిలుపునిచ్చారు. మూడు రోజులుగా అనంతపురంలోని పాతూరు నంబర్-2 స్కూల్‌లో జరుగుతున్న అటల్ ల్యాబ్ హబ్ వర్క్‌షాపు బుధవారం ముగిసింది. ఐదు పాఠశాలల విద్యార్థులతో సెన్సార్ ద్వారా పనిచేసే 7 ప్రాజెక్టులను విజ్ఞాన ఆశ్రమ్, యూనిసెఫ్ శిక్షకులు మనోజ్, కృష్ణ తయారు చేయించి, ప్రదర్శించారు. వీటిని పరిశీలించిన అనంతరం విద్యార్థులను అభినందిస్తూ ప్రశంసాపత్రాలను డీఈఓ నాగరాజు అందజేశారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ... చదువు కోసం ప్రభుత్వం పెడుతున్న ఖర్చుకు తగిన ఫలితాలు దక్కుతున్నాయన్నారు. జిల్లా సైన్స్ అధికారి బాలమురళీకృష్ణ మాట్లాడుతూ... అటల్ టింకరింగ్ ల్యాబ్‌లను వినియోగించుకుని శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలని విద్యార్థులకు సూచించారు. వర్క్‌షాపులో గార్లదిన్నె, పామిడి, రాప్తాడు మండలాల ఏపీ మోడల్ స్కూల్, కురుగుంట అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రశంసాపత్రం అందజేస్తున్న డీఈఓ నాగరాజు

పాము కాటుతో రైతు మృతి

ఆత్మకూరు: పాము కాటుతో ఓ రైతు మృతి చెందాడు. కుటుంబసభ్యులు తెలిపిన మేరకు... ఆత్మకూరు మండలం ముట్టాల గ్రామానికి చెందిన రైతు పెద్దిరాజు (35) వ్యవసాయంతో కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి తన పొలంలో సేద్య పరికరాలను మార్చేందుకు వెళ్లిన ఆయన పని ముగించుకుని కుటుంబసభ్యులతో అక్కడే నిద్రపోయారు. బుధవారం ఉదయం ఎంతసేపటికీ మేల్కొనకపోవడంతో కుటుంబసభ్యులు నిశితంగా పరిశీలించారు. నిద్రలో ఉన్నప్పుడు పాము కాటుకు గురై మృతి చెందినట్లు నిర్ధారించుకుని భోరున విలపించారు.

దూసుకొచ్చిన మృత్యు శకటం

- గొర్రెలు మేపేందుకు వచ్చి అన్నదమ్ముల దుర్మరణం
- లారీ కిందపడి మృతి చెందిన 30 గొర్రెలు



రుద్రేష్



గోపాల్ (ఫైల్)

రాయదుర్గం: గొర్రెల మందపై లారీ దూసుకెళ్లిన ఘటనలో అన్నదమ్ములు దుర్మరణం పాలయ్యారు. మరో 30 గొర్రెలూ మృతి చెందాయి. వివరాలు.. కర్ణాటకలోని బళ్లారి జిల్లా సండూరు తాలూకా నక్కలపల్లికి చెందిన అన్నదమ్ములు రుద్రేష్ (21), గోపాల్ (18) దాదాపు 500 గొర్రెలను తోలుకుని మేపు కోసం డి.హీరేహాళ్ ప్రాంతానికి వచ్చారు. వారం రోజులుగా మడేనహళ్లిలోని రైతు పొలంలో మందను వదిలిన వారు అక్కడ నుంచి నాగలాపురానికి బుధవారం బయలుదేరారు. టోల్ ప్లాజా దాటుకుంటుండగా వేగంగా వచ్చిన లారీ గొర్రెల మందపై దూసుకెళ్లింది. 30 గొర్రెలతో పాటు రుద్రేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన గోపాల్‌ను ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మరణించాడు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ లారీని ఆపకుండా ముందుకెళ్లిపోయాడు. ఘటనపై డి.హీరేహాళ్ ఎస్‌ఐ రంగడు యాదవ్ కేసు నమోదు చేసి, సీసీ ఫుటేజీల ఆధారంగా దర్యాప్తు చేపట్టారు.

ఫీజు వసూళ్ల శాతం పెరగాలి

- మార్కెటింగ్‌శాఖ ఆర్జేడీ రామాంజినేయులు

అనంతపురం అగ్రికల్చర్: ప్రస్తుత 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను మార్కెట్‌యార్డులు, చెక్‌పోస్టులకు నిర్దేశించిన ఫీజు వసూళ్ల లక్ష్యాలు వంద శాతం సాధించాలని సంబంధిత అధికారులను మార్కెటింగ్‌శాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ (ఆర్జేడీ) రామాంజినేయులు ఆదేశించారు. ఫీజు వసూళ్లపై ఉమ్మడి జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారులతో బుధవారం అనంతపురంలోని ఏడీఎం కార్యాలయంలో ఆయన సమీక్షించారు. ఉమ్మడి జిల్లా పరిధిలో ఉన్న 17 మార్కెట్ యార్డులు, 30 చెక్‌పోస్టుల ద్వారా సాధించిన ప్రగతిపై యార్డుల వారీగా అడిగి తెలుసుకున్నారు. అనంతపురం జిల్లా పరిధిలోని 9 మార్కెట్ యార్డుల టార్గెట్ రూ.10.81 కోట్లు కాగా ఇప్పటికే రూ.8 కోట్లకు పైగా వసూళ్లతో 80 శాతం ప్రగతి సాధించినట్లుగా తెలిపారు. ఇందులో గుత్తి, గుంతకల్లు మినహా మిగిలిన ఏడు కమిటీల పనితీరు మెరుగ్గా ఉందంటూ అభినందించారు. శ్రీసత్యసాయి జిల్లా పరిధిలోని 8 మార్కెట్‌యార్డుల లక్ష్యం రూ.4.72 కోట్లు కాగా ఇప్పటి వరకూ రూ.3.50 కోట్ల వసూళ్లతో 77 శాతం ప్రగతి సాధించడంపై అభినందించారు. ఇక్కడ కూడా తనకల్లు, పెనుకొండ మార్కెట్ యార్డులు పూర్తిగా వెనుకబడడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. రానున్న ఫిబ్రవరి, మార్చి నెలల్లో వసూళ్లు పెంచాలని ఆదేశించారు. నిర్దేశిత గడువు ముగిసేలోపు అన్ని కమిటీలు వంద శాతం లక్ష్యం సాధించేలా చర్యలు తీసుకోవాలని ఏడీఎంలు పి.సత్యనారాయణచౌదరి, నరసింహమూర్తికి సూచించారు.

2న జీఎన్ఎం కౌన్సెలింగ్

అనంతపురం మెడికల్: ఈ నెల 2 నుంచి రెండ్రోజుల పాటు డీఎంహెచ్ఓ కార్యాలయంలో జీఎన్ఎం కోర్సుకు సంబంధించి దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఈ మేరకు డీఎంహెచ్ఓ డాక్టర్ భ్రమరాంబదేవి బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. సైన్స్ గ్రూపు ఉత్తీర్ణులైన రెగ్యులర్ అభ్యర్థులకు శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి కౌన్సెలింగ్ ఉంటుంది. అలాగే ఈ నెల 3న ఉదయం 10 గంటలకు సైన్స్‌లో కంపార్ట్‌మెంట్ ఉత్తీర్ణత, ఆర్ట్స్ రెగ్యులర్, కంపార్ట్‌మెంట్ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు వారికి వచ్చిన మెరిట్ ఆధారంగా కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. విద్యార్థులు తమవెంట ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకుని హాజరుకావాలి.

జనవాక్కు

ఆసరాతో ఆదుకున్నారు



మహిళా సంఘంలో సంఘం సభ్యురాలిగా ఉన్న నాకు ఏటా వైఎస్సార్ ఆసరా కింద రూ.7,483 అందుతోంది. గతంలో డ్వాక్రా సంఘాల రుణాలు మాఫీ చేస్తానంటూ చంద్రబాబు ఇచ్చిన హామీని నమ్మి చాలా మోసపోయాం. రుణం మాఫీ అవుతుందనుకుని కంతులు కట్టలేని చాలా మంది సభ్యులు బ్యాంకుల్లో డీఫాల్టర్లుగా మారారు. ఇలాంటి పరిస్థితుల్లో వైఎస్ జగనన్న సీఎంగా బాధ్యతలు తీసుకుని వైఎస్సార్ ఆసరా పథకంతో బ్యాంక్‌ల్లోని మా రుణాలు మాఫీ అయ్యేలా చర్యలు తీసుకున్నారు. మా గౌరవాన్ని పెంచారు. మళ్లీ జగనన్నే సీఎం కావాలని కోరుకుంటున్నాం.

– ముత్యాలమ్మ, నూతిమడుగు, కంబదూరు మండలం

సీఎం జగన్‌తోనే సంక్షేమం



నాయీ బ్రాహ్మణ వృత్తిలో 30 ఏళ్లుగా కొనసాగుతున్న నేను చాలీచాలని సంపాదనతో కుటుంబాన్ని పోషించుకునేవాడిని. గతంలో ఏ ప్రభుత్వమూ నాయీ బ్రాహ్మణులకు ఉచితంగా ఆర్థిక సాయం అందించిన దాఖలాలు లేవు. మా కష్టాలను తెలుసుకున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటనే స్పందిస్తూ కులవృత్తిపై ఆధారపడిన మాకు ఏటా రూ.10వేలు ఆర్థిక సాయాన్ని అందజేస్తున్నారు. ఇప్పటికే రూ.40 వేల లబ్ధిని పొందాను. కుల వృత్తిదారులకు అండగా నిలిచిన సీఎం వైఎస్ జగన్‌కే మా మద్దతు. ఆయన పాలనలో ఉన్నంత కాలమూ సంక్షేమ పథకాల వెల్లువ కొనసాగుతుంది.

– సురేష్, పూలకుంట, గుమ్మఘట్ట

ఇంటి వద్దకే పింఛన్



నేను వికలాంగుడిని. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత నాకు దివ్యాంగుల కోటాలో పింఛన్ మంజూరైంది. ప్రతి నెలా ఇంటి వద్దకే పింఛన్ సొమ్ము తీసుకువచ్చి ఇస్తున్నారు. గతంలో పింఛన్ సొమ్ము కోసం లబ్ధిదారులు పడిన ఇబ్బందులు ఇప్పటికీ కంటి ముందు కదులుతోంది. రోజుల తరబడి పంచాయతీ కార్యాలయం వద్ద పడిగాపులు కాచేవారు. ఇప్పుడా పరిస్థితి లేదు. తెల్లవారుజామునే వలంటీర్ ఇంటి వద్దకే వచ్చి పింఛన్ అందజేసేలా చేసిన సీఎం వైఎస్ జగనన్నకే మా మద్దతు.

– బండి వెంకటేష్, చోళసముద్రం, కూడేరు మండలం

పంచాయతీరాజ్ ఎస్ఈగా ఈరాస్వామి

అనంతపురం సిటీ: జిల్లా పంచాయతీరాజ్ శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్(ఎస్ఈ)గా ఎం.ఈరాస్వామి నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ బి.రాజశేఖర్ బుధవారం రాత్రి 10 గంటలకు ఉత్తర్వులు జారీ చేశారు. కృష్ణా జిల్లా(మచిలీపట్నం) పీఆర్ ఎస్ఈగా పని చేస్తూ దీర్ఘకాలిక సెలవులో వెళ్లిన ఆయన తిరిగొచ్చారు. దీంతో ఆయన్ను అనంతపురం పీఆర్ ఎస్ఈగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, ఈ స్థానంలో ఇప్పటి వరకూ కొనసాగిన యమ్మాని భాగ్యరాజ్ పదవీ కాలం బుధవారం ముగిసింది. దీంతో ఆయన స్థానంలో ఈరాస్వామి బాధ్యతలు స్వీకరించనున్నారు.

బాలల బీమా ప్రీమియం గడువు పొడిగింపు

అనంతపురం ఎడ్యుకేషన్: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం అమలవుతున్న బాలల బీమా పథకానికి సంబంధించి ప్రీమియం చెల్లింపు గడువును ఈ నెల 10 వరకు పొడిగించారు. వాస్తవానికి బుధవారంతో చెల్లింపు గడువు ముగిసింది. సమగ్ర శిక్ష అధికారుల నుంచి సరైన ప్రచారం, సమన్వయం లేని కారణంగా ఏ ఒక్క స్కూల్ నుంచి కూడా ప్రీమియం చెల్లింపులు జరగలేదు. కొందరు హెచ్ఎంలు స్వయంగా కార్యాలయానికి ఫోన్లు చేసి తమకు సమాచారం తెలీదంటూ పేర్కొన్నారు. ఈ క్రమంలో కలెక్టర్ గౌతమి ఆదేశాలతో ఈ నెల 10 వరకు గడువు పొడిగించారు. ప్రతి విద్యార్థితో రూ.5 ప్రకారం వసూలు చేసి ఆ మొత్తాన్ని డీడీలు తీసి ఎంఈఓలు ఈ నెల 15లోగా సమగ్ర శిక్ష కార్యాలయంలో అందజేయాలని ఏపీసీ వరప్రసాద్‌రావు సూచించారు.

పోలీస్ డైరీ ఆవిష్కరణ



పోలీస్ డైరీని ఆవిష్కరిస్తున్న ఎస్పీ అన్బురాజన్, తదితరులు

అనంతపురం: పోలీస్ డైరీ-2024ను ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ బుధవారం ఆవిష్కరించారు. పోలీసులకు సంబంధించిన సమగ్ర సమాచారం కలిగిన ఈ డైరీ రోజువారీ దైనందిన కార్యకలాపాల్లో సిబ్బందికి ఎంతగానో దోహదపడుతుందన్నారు. పోలీస్ డైరీ-2024 రూపకల్పన చేసిన వారిని అభినందించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఆర్.విజయభాస్కరరెడ్డి, జిల్లా పోలీస్ అధికారుల సంఘం అడ్‌హక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్‌నాథ్, సుధాకర్‌రెడ్డి, గాండ్ల హరినాథ్, తేజ్‌పాల్, శివప్రసాద్, వెంకట రమణ, సరోజ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉపాధ్యాయురాలికి వీడ్కోలు



ఉపాధ్యాయురాలు పార్వతిని సన్మానిస్తున్న దృశ్యం

ఆత్మకూరు: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో పని చేస్తున్న సోషల్ ఉపాధ్యాయురాలు పార్వతి బుధవారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఆమెను తోటి ఉపాధ్యాయలు, విద్యార్థులు శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. అనంతరం ఉపాధ్యాయురాలు పార్వతి మాట్లాడుతూ.. 34 సంవత్సరాలు ఉపాధ్యాయురాలిగా పని చేయడం సంతోషంగా ఉందన్నారు. ఆత్మకూరులో మూడు సంవత్సరాలు పని చేశానని, ఇక్కడి విద్యార్థుల తల్లిదండ్రుల సహకారం ఎప్పటికీ మరువలేనని తెలిపారు.

4న వైఎస్సార్ ఆసరా సంబరాలు

ఆత్మకూరు: మండల కేంద్రంలో గురువారం జరగాల్సిన వైఎస్సార్ ఆసరా సంబరాలను అనివార్య కారణాలతో వాయిదా వేసినట్లు వైఎస్సార్‌సీపీ నాయకులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 4వ తేదీన వైఎస్సార్ ఆసరా సంబరాలు నిర్వహిస్తామన్నారు. డ్వాక్రా మహిళలకు చెక్కు అందజేయడం జరుగుతుందన్నారు. మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ అభిమానులు గుర్తించాలని కోరారు.

పరామర్శ



మాజీ జెడ్పీటీసీ బంధూక మధు ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

ఆత్మకూరు: జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో గుండె సంబంధిత వ్యాధితో వైఎస్సార్‌సీపీ నాయకుడు, మాజీ జెడ్పీటీసీ బంధూక మధు చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి బుధవారం మధును పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు. అలాగే జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు తోపుదుర్తి భాస్కర్‌రెడ్డి పరామర్శించి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఫణిరెడ్డి, వాసుదేవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంసిద్ ఇంటర్నేషనల్ స్కూల్ గుర్తింపు రద్దు చేయాలి

అనంతపురం ఎడ్యుకేషన్: సంసిద్ ఇంటర్నేషనల్ పాఠశాల గుర్తింపును రద్దు చేసి, ప్రిన్సిపాల్, యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం పాఠశాల ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రమణయ్య, కుల్లాయి స్వామి ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పరమేష్ మాట్లాడారు. సంసిద్ స్కూల్‌లో హాస్టల్ వార్డెన్ మద్యం సేవించి వాతలు పడేలా విద్యార్థులను కొట్టాడన్నారు. యాజమాన్యం పర్యవేక్షణ లేని కారణంగానే ఈ దుస్థితి నెలకొందన్నారు. పాఠశాలపై అధికారులు చర్యలు తీసుకోకపోతే పెద్ద ఎత్తున ఉద్యమాలకు శ్రీకారం చుడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు వంశీ, ఉమా మహేష్, మంజు, హరి, ఎస్ఎఫ్ఐ నాయకులు సిద్దు, గిరి, సూర్యప్రకాష్, భీమేష్, సోము తదితరులు పాల్గొన్నారు.

మత సామరస్యంతోనే ఆరోగ్యకర సమాజం



డాక్టర్ రమేష్ నారాయణను సత్కరిస్తున్న సాహితీ సమితి సభ్యులు

అనంతపురం కల్చరల్: మత సామరస్యంతోనే ఆరోగ్యకర సమాజం సాధ్యమని రాష్ట్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ పతికి రమేష్ నారాయణ అన్నారు. శ్రీవిశ్వవిజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠం నవమ పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా జన్మదిన వేడుకలు బుధవారం స్థానిక సాహితీ సమితి కార్యాలయంలో జరిగాయి. కురుగుంట గ్రామంలో సాహిత్య, సేవా కార్యక్రమాలు నిర్వహించారు. రమేష్‌నారాయణ రచించిన 'దార్శనిక చక్రవర్తి ఉమర్ ఆలీషా దివ్యభావ లహరి' పుస్తకావిష్కరణ జరిగింది. రాష్ట్ర స్థాయి వ్యాసరచన పోటీల్లో జిల్లా ఖ్యాతిని చాటుతూ తృతీయ బహుమతి దక్కించుకున్న సీనియర్ జర్నలిస్టు నాగభూషణంను సత్కరించారు. అనంతరం స్వామి జన్మదినాన్ని పురస్కరించుకుని డాక్టర్ నాగేంద్ర, కరుణకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో వందలాది మందికి ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో సాహితీ సమితి అధ్యక్ష కార్యదర్శులు రియాజుద్దీన్, సుంకర రమేష్, రాష్ట్రపతి అవార్డు గ్రహీతలు బిసాతి భరత్, జయమారుతి, సామాజిక సేవాకార్యకర్తలు కమలనాథ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

జగన్ అంటేనే నిజం.. చంద్రబాబు అంటే వెన్నుపోటు





మహిళలకు వైఎస్సార్ ఆసరా మెగాచెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, సమావేశానికి హాజరైన డ్వాక్రా మహిళలు

- రానున్న ఎన్నికల్లో టీడీపీకి బుద్ధి చెప్పాలి
- ప్రజలకు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పిలుపు
- ఘనంగా వైఎస్సార్ ఆసరా సంబరాలు

రాప్తాడు రూరల్: జగన్ అంటే నిజం.. చంద్రబాబు అంటే అబద్ధం, మోసం, కుట్ర, దగా, వెన్నుపోటు అని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి మండిపడ్డారు. బుధవారం అనంతపురం రూరల్ మండలం రాచానపల్లిలో 'వైఎస్సార్ ఆసరా సంబరాలు' నిర్వహించారు. రాచానపల్లితో పాటు తాటిచెర్ల, సోములదొడ్డి, కురుగుంట,కామారుపల్లి, చిన్నంపల్లి, అక్కంపల్లి, కొడిమి, నరసనాయనికుంట పంచాయతీల నుంచి పొదుపు సంఘాల సభ్యులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో పచ్చ కండువాలు కప్పుకున్న వారికి, జన్మభూమి కమిటీ సభ్యులు చెప్పిన వారికి, టీడీపీ నాయకుల ఇళ్ల చుట్టూ తిరిగే వారికే సంక్షేమ పథకాలు అందేవన్నారు. జగనన్న ముఖ్యమంత్రి అయిన తర్వాత కులాలు, మతాలు, పార్టీలు చూడటం లేదన్నారు. కేవలం అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. జగనన్న వచ్చినప్పటి నుంచి ఈ రోజు వరకూ రూ.2.53 లక్షల కోట్లు నిరుపేదల అక్కచెల్లెమ్మల బ్యాంకు ఖాతాల్లో జమ చేశారన్నారు. మా వెనుక జగన్ ఉన్నాడనే ధైర్యాన్ని మహిళలకు కల్పించారన్నారు. వైఎస్సార్ ఆసరా పథకం కింద 80 లక్షల మంది అక్కచెల్లెమ్మలకు రూ.25,500 కోట్ల లబ్ధి చేకూర్చారని కొనియాడారు. సున్నా వడ్డీ కింద మరో రూ.5,500 కోట్ల లబ్ధి చేకూర్చారని తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ మహిళా సంఘాలకు ఇందులో పది శాతం కూడా లబ్ధి చేకూర్చలేదన్నారు. మహిళల కళ్లల్లో ఆనందం చూడాలన్నదే జగనన్న తపన అన్నారు. మీ గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోవడమే అజెండాగా పెట్టుకుని జగనన్న పని చేస్తున్నారని వెల్లడించారు. అదే చంద్రబాబు జెండాలను జత కట్టుకుని పోవడమే అజెండాగా పని చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇన్ని సార్లు బటన్ నొక్కి మీ జీవితాల్లో వెలుగులు నింపిన జగనన్న కోసం ఒక్కసారి మీరు బటన్ నొక్కలేరా? అని ప్రశ్నించారు. మీ నొక్కుడు టీడీపీకి పీక నొక్కుడు కావాలని పిలుపునిచ్చారు. రాప్తాడు నియోజకవర్గంలో గత పాలనకు.. వైఎస్సార్‌సీపీ పాలనకు తేడా గమనించాలని కోరారు. ఆత్మకూరు, అనంతపురం రూరల్ మండలాలకు ఫిబ్రవరి నెలలోపు తుంగభద్ర నీటిని ఇస్తామన్నారు. అనంతరం పొదుపు సంఘాల సభ్యులకు మెగా చెక్కు అందజేశారు. అలాగే రాచానపల్లిలో ఆర్బీకే, వెల్‌నెస్ సెంటర్, జగనన్న పాలవెల్లువ కేంద్రాలను ప్రారంభించారు.

రాచానపల్లి సర్పంచ్ ఆధ్వర్యంలో భోజనాలు

సమావేశానికి హాజరైన పొదుపు సంఘాల సభ్యులకు రాచానపల్లి సర్పంచ్ బండా అంజియాదవ్ ఆధ్వర్యంలో భోజన వసతి కల్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ధనుంజయ యాదవ్, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్లు నాగేశ్వరరెడ్డి, గోపాల్‌రెడ్డి, ఎంపీపీ వరలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు చంద్రకుమార్, ఎంపీడీఓ పుల్లయ్య, వైస్ ఎంపీపీ కృష్ణారెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు గౌస్, మాజీ ఎంపీపీ సూర్యనారాయణ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు రమణారెడ్డి, వై.రామకృష్ణారెడ్డి, బాలకృష్ణ, రామ్మోహన్, మాధవరెడ్డి, లోకనాథరెడ్డి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే రాష్ట్రాభివృద్ధి

రామగిరి: వైఎస్సార్‌సీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వాలు పేదలను విస్మరించాయన్నారు. అయితే వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే కుల, మత, ప్రాంతాలను పట్టించుకోకుండా బడుగు, బలహీన వర్గాలకు పథకాలు అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రాంతంలో పరిటాల కుటుంబం నక్సల్స్‌ను అడ్డుపెట్టుకుని అభివృద్ధిని విస్మరించారన్నారు. మేము అధికారంలోకి రాగానే పేద ప్రజలను గుర్తించి, ఉచితంగా బోర్లు వేయించామన్నారు. హంద్రీనీవా నీటిని తీసుకొచ్చి అన్ని చెరువులను నింపినట్లు తెలిపారు. పేరూరు డ్యాంకు జలాలు తీసుకొచ్చిన ఘనత వైఎస్సార్‌సీపీకే దక్కుతుందన్నారు. త్వరలోనే రామగిరి బంగారు గనులను తెరిపించి కార్మికులకు అండగా ఉంటామని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌ను గెలిపించుకుని, మరోమారు రాప్తాడులో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ మీనుగ నాగమ్మ, జెడ్పీటీసీ నాగార్జున, మండల కన్వీనర్ కక్రా హనుమంతరెడ్డి, సర్పంచులు మీనుగ నాగరాజు, రాజేష్, నరేంద్ర, సిద్ధన్న, చెన్నకేశవరెడ్డి, ఓబిరెడ్డి, రామ్మూర్తి, నాయకులు నరసింహారెడ్డి, వెంకటరెడ్డి, ఆదిరెడ్డి, రామాంజనేయులు పాల్గొన్నారు.

సేవాగుణం అలవర్చుకోండి



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

అనంతపురం రూరల్: విద్యార్థి దశ నుంచే సేవా భావం అలవర్చుకుంటే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు చేరుకోవచ్చని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ పేర్కొన్నారు. ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రగతి పథం యూనిట్, వైఎస్సార్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో వారం రోజులుగా కురుగుంటలో జరగుతున్న ఎన్ఎస్ఎస్ క్యాంపు బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా కురుగుంట సోషల్ వెల్ఫేర్ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ హజర్యయారు,. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ శశాంక, అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ సుంకర రమేష్, ఐక్యరాజ్య సమితి అవార్డు గ్రహీత బిసాతి భరత్, కురుగుంట బాలయోగి గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ ఉదయశ్రీ, ఎన్ఎస్ఎస్ పోగ్రాం ఆఫీసర్ విష్ణుప్రియ, వైఎస్సార్ ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి నమిత తదితరులు పాల్గొన్నారు.

పీఎంఎఫ్ఎంఈ చెక్కుల పంపిణీ



చెక్కులు అందజేస్తున్న దృశ్యం

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని 35వ డివిజన్ మారుతీనగర్‌లో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు నిర్వహిస్తున్న ముగ్గురు మహిళలకు బుధవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి, మెప్మా సీఓ సత్యమూర్తి చెక్కులను పంపిణీ చేశారు. ప్రధాన మంత్రి ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్స్ (పీఎంఎఫ్ఎంఈ) కింద నగరంలో 17 మంది మహిళలకు ఒక్కొక్కరికి రూ.40,000 చొప్పున మంజూరైంది. అందులో భాగంగా మారుతీనగర్‌కు చెందిన హేమలత, లీలావతి, అనితకు రూ.1,20,000 మంజూరైనట్లు అధికారులు తెలిపారు.

పారిశుధ్య సమస్యకు పరిష్కారం చూపాలి



బిందెలకాలనీలో మురుగును పరిశీలిస్తున్న కమిషనర్ మేఘస్వరూప్

అనంతపురం కార్పొరేషన్: నగర శివారు బిందెల కాలనీలో పారిశుధ్య సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ మేఘస్వరూప్ ప్రజారోగ్యాధికారులను ఆదేశించారు. బుధవారం బిందెలకాలనీ, సెంట్రల్ పార్క్, తడకలేరు ఎస్టీపీ, హరిశ్చంద్రఘాట్ వద్ద ఉన్న క్రిమటోరియమ్, సూర్యనగర్ రోడ్డు తదితర ప్రాంతాల్లో కమిషనర్ పర్యటించారు. బిందెల కాలనీలో ఇళ్ల మధ్య మురుగు ఉండడంతో సంబంధిత అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. మొదట ఈ ప్రాంతంలో సర్వే చేయించి, అప్రోచ్ రోడ్లు, కాలువలకు సంబంధించి వివరాలను తెలియజేయాలన్నారు. నగరపాలక సంస్థలో సర్వేయర్ పోస్టు ఖాళీగా ఉందని టౌన్ ప్లానింగ్ సిబ్బంది కమిషనర్ దృష్టికి తీసుకెళ్లగా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం సెంట్రల్ పార్క్ స్థలాన్ని పరిశీలించిన కమిషనర్.. నగరపాలక సంస్థకు చెందిన స్థలం ఎన్ని బ్లాక్‌లలో ఉంది, తదితర వివరాలపై ఆరా తీశారు. ఇప్పటికే ఓపెన్ స్పేస్ మార్కింగ్ వేయడం జరిగిందని, రక్షణ గోడ ఏర్పాటు చేయాల్సి ఉందని టౌన్ ప్లానింగ్, ఇంజినీరింగ్ అధికారులు కమిషనర్‌కు వివరించారు. తడకలేరు వద్ద అమృత్ 2.0లో భాగంగా రూ.29.76 కోట్లతో ఏర్పాటు చేయనున్న సివరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (ఎస్‌టీపీ) స్థలాన్ని పరిశీలించారు. మరో పది రోజుల్లో నిర్మాణ పనులు జరిగేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఈఈ సూర్యనారాయణ కమిషనర్‌కు వివరించారు. హరిశ్చంద్రఘాట్ వద్ద 14వ ఆర్థిక సంఘం నిధులు రూ.32.95 లక్షలతో ఏర్పాటు చేయనున్న క్రిమటోరియమ్ మిషనరీ పనులను పరిశీలించారు. కంపోస్టు యార్డును పరిశీలించిన కమిషనర్ చెత్త నిర్వహణ ఏ మేరకు జరిగిందని నగరపాలక సంస్థ కార్యదర్శి సంగం శ్రీనివాసులను ఆరా తీశారు. ఎన్‌క్యాప్ నిధులు రూ.30 లక్షలతో ఏర్పాటు చేయనున్న ప్లాంట్‌ను కమిషనర్ పరిశీలించారు. అనంతరం సూర్యనగర్ రోడ్డులో ఏర్పాటు చేయనున్న సిమెంట్ రోడ్డు, డివైడర్ల పనులను పర్యవేక్షించారు. అభివృద్ధి పనులు వేగవంతం చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. కమిషనర్ వెంట టీపీఓ శిరీష, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ దుర్గాంజలి, డీఈ సుభాష్, తదితరులు ఉన్నారు.

విజయలక్ష్మి సేవలు అమూల్యం



ఏఈఓ విజయలక్ష్మిని సన్మానిస్తున్న సిబ్బంది

అనంతపురం రూరల్: అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ విజయలక్ష్మి సేవలు ఎనలేనివని బీసీ కార్పొరేషన్ ఈడీ సుబ్రహ్మణ్యం అన్నారు. బీసీ కార్పొరేషన్ ఏఈఓగా విధులు నిర్వర్తిస్తున్న విజయలక్ష్మి బుధవారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది ఆమెను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఈడీ మాట్లాడుతూ.. విజయలక్ష్మి విధులను సక్రమంగా నిర్వర్తిస్తూ అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందించారన్నారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది రాజు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణ సద్వినియోగం చేసుకోండి



స్టడీ మెటీరియల్ అందజేస్తున్న బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయ ఉప సంచాలకులు కుష్బూకొఠారి

అనంతపురం రూరల్: ఏపీపీఎస్సీ గ్రూప్–1, 2 పరీక్షల కోసం ప్రభుత్వం అందించే శిక్షణను అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయ ఉప సంచాలకులు కుష్బూ కొఠారి అన్నారు. గ్రూప్–1, 2 శిక్షణ పొందుతున్న అభ్యర్థులకు బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయంలో బుధవారం స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నిరుద్యోగ యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఉచిత శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేసిందన్నారు. కార్యక్రమంలో బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయ సిబ్బంది రవి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో రచ్చకెక్కిన విభేదాలు

- టీడీపీ మైనార్టీ నాయకుడిపై జేసీ వర్గీయుడి దాడి
- పరస్పరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

అనంతపురం: టీడీపీలో వర్గవిభేదాలు మరోసారి రచ్చకెక్కాయి. ఆ పార్టీకి చెందిన మైనార్టీ నాయకుడిపై జేసీ వర్గీయుడు, టౌన్ బ్యాంక్ అధ్యక్షుడు జేఎల్ మురళీ దాడికి పాల్పడిన సంఘటన బుధవారం స్థానిక వేణుగోపాల్ నగర్‌లో చోటుచేసుకుంది. వన్ టౌన్ పోలీసులు తెలిపిన వివరాలు.. టీడీపీ మైనార్టీ విభాగం నగర అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్‌పై టౌన్ బ్యాంక్ అధ్యక్షుడు జేఎల్ మురళీ భౌతికదాడికి పాల్పడ్డాడు. వేణుగోపాల్ నగర్‌లో జేఎల్ మురళీ నివాసం వద్ద ఇద్దరు తారసపడ్డారు. ఈ సమయంలో ఎంపీ, ఎమ్మెల్యేల సీట్లు తమకంటే తమకంటూ సవాల్ విసురుకున్నారు. మాటామాట పెరగడంతో అబ్దుల్ అజీజ్‌ను జేఎల్ మురళీ నానా దుర్భాషలాడుతూ దాడి చేశాడు. తనకు మైనార్టీ కోటాలో అనంతపురం ఎంపీ టికెట్ దక్కుతుందనే ఉద్దేశంతో వ్యక్తిగత ప్రతిష్టతను దెబ్బతీసేందుకు దాడి చేశారని బాధితుడు అబ్దుల్ అజీజ్ వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతపురం ఎమ్మెల్యే టికెట్ తనకు వస్తుందనే ఉద్దేశంతోనే ఇలా కుట్ర జరుగుతోందని టౌన్ బ్యాంక్ అధ్యక్షుడు జేఎల్ మురళీ ఆరోపించారు. ఇరువర్గాలను స్టేషన్‌కు పిలిపించిన పోలీసులు ఘటనపై విచారణ చేపట్టారు. జేసీ వర్గీయుడైన జేఎల్ మురళీ తరచూ వివాదాలతో రెచ్చిపోతున్నారు. నగరంలో సింహభాగం ఓటర్లు ఉన్న మైనార్టీలపై టీడీపీ నాయకులు దాడికి పాల్పడటం సరికాదని పలువురు మండిపడుతున్నారు. ఇదిలా ఉండగా అనంతపురం మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి వన్‌టౌన్ స్టేషన్‌కు వెళ్లి అబ్దుల్ అజీజ్‌ను పరామర్శించారు. ఇరువర్గాల ఫిర్యాదుల మేరకు కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ దాడికి నిరసనగా గురువారం నగరంలో మైనార్టీ నాయకులు ఆందోళనకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది.

లక్ష్మీనారాయణకు డాక్టరేట్



అనంతపురం: ఎస్కేయూ తెలుగు భారతి విభాగంలో పరిశోధన చేసిన వడ్డే లక్ష్మీనారాయణకు బుధవారం డాక్టరేట్ ప్రదానం చేశారు. ప్రొఫెసర్ ఎస్.ఆర్.సదాశివా రెడ్డి పర్యవేక్షణలో 'దశాబ్ది వచన కవిత్వం (2001–2010) పరిశీలనాంశం'పై ఈయన పరిశోధన చేశారు. 14 జాతీయ సదస్సులు, 5 అంతర్జాతీయ సదస్సుల్లో పాల్గొని పరిశోధన పత్రాలు సమర్పించారు. వివిధ అంశాలపై రాసిన 12 పరిశోధన వ్యాసాలు ప్రముఖ జర్నల్స్‌లో ప్రచురితమయ్యాయి. డాక్టరేట్ పొందిన సందర్భంగా ఎస్కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎంవీ లక్ష్మయ్య, డీన్ ప్రొఫెసర్ నరసింహన్ అభినందించారు. కాగా.. లక్ష్మీనారాయణ ప్రస్తుతం అనంతపురం నగరంలోని జనశక్తి నగర్ సచివాలయంలో వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నారు.

రేపు వాసవీమాత నగరోత్సవం

అనంతపురం కల్చరల్: వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవి దీక్ష సందర్భంగా శుక్రవారం సాయంత్రం నగరోత్సవం నిర్వహిస్తున్నట్లు కొత్తూరు వాసవీ దీక్షా సమితి ప్రతినిధులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4 గంటలకు మేళతాళాలతో స్థానిక కొత్తూరు అమ్మవారి శాల నుంచి వైశ్యాహాస్టల్, తిలక్‌రోడ్, గాంధీబజార్, సుభాష్‌రోడ్డు మీదుగా శోభయాత్ర ఉంటుందన్నారు.

ప్రభుత్వానికి అండగా నిలవండి



భవానీ నగర్‌లో పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం కార్పొరేషన్: దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ఏపీలో పెద్ద ఎత్తున సంక్షేమం, అభివృద్ధి చేపట్టేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విప్లవాత్మక సంస్కరణలు తీసుకొచ్చారు. ప్రజలకు మంచి చేసిన ప్రభుత్వానికి అందరూ అండగా నిలవాలని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం నగరంలోని 10వ డివిజన్ గుత్తి రోడ్డు వద్ద ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ కార్యక్రమం జరిగింది. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజలకు అందించిన సంక్షేమం, నగరంలో చేపట్టిన అభివృద్ధికి సంబంధించిన కరపత్రాలను ఇంటింటికీ వెళ్లి అందించారు. రానున్న ఎన్నికల్లో మా భవిష్యత్తుకు బాటలు వేసిన వైఎస్సార్‌సీపీకే ఓటు వేస్తామని ప్రజలు తెలిపారు. ఇదిలా ఉండగా ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. పార్టీ జెండాలను చేతపట్టుకుని, ఫ్యాన్ గుర్తును ప్రజలకు చూపిస్తూ సందడి చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత టీడీపీ ప్రభుత్వంలో పింఛన్ రావాలన్నా..జన్మభూమి కమిటీల సభ్యుల చుట్టూ తిరగాల్సి వచ్చేదన్నారు. ఎన్నో సందర్భాల్లో పింఛన్ ఆపేయడంతో లబ్ధిదారులు నగరపాలక సంస్థ చుట్టూ ప్రదక్షిణలు చేశారన్నారు. అయితే వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్ మంజూరు చేయడం జరుగుతోందన్నారు. ప్రతి నెలా 1వ తేదీ ఉదయం 5 గంటల నుంచే పింఛన్ అందిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ఇంటి వద్దకే పాలన అందిస్తున్నట్లు తెలిపారు. కోవిడ్ విపత్కర పరిస్థితుల్లో ప్రతిపక్షాలు దాక్కుంటే ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా.. వలంటీర్లు ఇంటి వద్దకే వెళ్లి సేవలందించారని తెలిపారు. నగర అభివృద్ధి విషయానికొస్తే.. నగరం నలుదిక్కులా విశాలవంతమైన రోడ్లను ఏర్పాటు చేశామన్నారు. మారుమూల ప్రాంతాల్లో నడవడానికే ఇబ్బందిగా ఉండేదన్నారు. ఆ ప్రాంతాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం నిధులు, నగరపాలక సంస్థ సాధారణ నిధులతో పెద్ద ఎత్తున రోడ్లు, కాలువలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రజలకు మంచి చేసిన ప్రభుత్వాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, మార్కెట్‌యార్డు చైర్మన్ ఫయాజ్, కార్పొరేటర్లు లక్ష్మీదేవి, ఇసాక్, సాకే చంద్ర, అబూసలేహా, బాబా, టీవీ చంద్రమోహన్ రెడ్డి, రహంతుల్లా, లీలావతి, కో–ఆప్షన్ సభ్యులు లక్ష్మీరెడ్డి, షంషుద్దీన్, డైరెక్టర్లు శోభారాణి, శ్రీనివాసులు, ప్రసాద్, పార్టీ సీనియర్ నేత అనంత చంద్రారెడ్డి, ఆలమూరు శ్రీనివాస్ రెడ్డి, చింతా సోమశేఖర్ రెడ్డి, క్లస్టర్ అధ్యక్షుడు మధు, ఓబిరెడ్డి, అనుబంధ సంఘాల అధ్యక్షులు ఉమ్మడి మదన్‌మోహన్ రెడ్డి, శ్రీదేవి, సైఫుల్లాబేగ్, కొర్రపాడు హుస్సేన్ పీరా, కృష్ణవేణి, నాయకులు దాదు, సుహాసిని, సుజాత, శాంతి, జావెద్, తదితరులు పాల్గొన్నారు.

సజావుగా మటన్ మార్కెట్ వేలం



నగరపాలక సంస్థలో వేలంపాట నిర్వహిస్తున్న దృశ్యం

అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థలో బుధవారం ఉదయం మటన్ మార్కెట్ వేలం పాట సజావుగా సాగింది. నగరపాలక సంస్థ కార్యదర్శి సంగం శ్రీనివాసులు వేలంపాటను నిర్వహించారు. కూరగాయల మార్కెట్ వేలంపాటకు ఎవరూ ముందుకు రాకపోవడంతో ఈనెల 7వ తేదీకి వేలం పాటను వాయిదా వేశారు. కూరగాయల మార్కెట్ లీజుకు సంబంధించి సెక్యూరిటీ డిపాజిట్ రూ.7,50,000, సాల్వెన్సీ సర్టిఫికెట్ లేకపోతే అదనపు డిపాజిట్ రూ.5,00,000 ఈనెల 6వ తేదీలోపే చెల్లించాల్సి ఉంటుందని కార్యదర్శి సంగం శ్రీనివాసులు పేర్కొన్నారు. మటన్ మార్కెట్‌కు సంబంధించి ఇద్దరి మధ్య పోటీ సాగింది. చివరకి యు.లోకనాథ్‌రెడ్డి అనే కాంట్రాక్టర్ మటన్ మార్కెట్‌ను రూ.5,13,000లకు దక్కించుకున్నాడు. కార్యక్రమంలో ఆర్ఓలు సతీష్, సుజాత, ఆర్ఐలు వేణుగోపాల్, మురళీ, బాబు, పద్మావతి, జూనియర్ అసిస్టెంట్ శరత్, తదితరులు పాల్గొన్నారు.

సేవాఘడ్ మీదుగా బస్సులు నడపాలి



జిల్లా ప్రజారవాణా అధికారి సుమంత్ ఆర్ ఆదోనికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

అనంతపురం సెంట్రల్: బంజారాల ఆరాధ్య దైవం సేవాలాల్ మహరాజ్ కొలువైన సేవాఘడ్ మీదుగా ఆర్టీసీ బస్సులను నడపాలని ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం నాయకులు కోరారు. బుధవారం జిల్లా ప్రజారవాణా అధికారి సుమంత్ ఆర్ ఆదోనిని ఆయన ఛాంబర్‌లో కలసి వినతిపత్రం అందజేశారు. అనంతపురం నుంచి గుంతకల్లుకి, గుంతకల్లు నుంచి కర్నూలుకు అనంతపురంకు వెళ్లే బస్సులను సేవాఘడ్ మీదుగా నడపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు బాలాజీ నాయక్, మహిళా విభాగం అధ్యక్షురాలు సుగుణ బాయి, నాయకులు శివమ్మ, పరమేష్ నాయక్, శంకర్ నాయక్, ఈశ్వరి బాయి, బన్సీలాల్ నాయక్, గోవింద్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఆసరా సంబరాలు

కనగానపల్లి: మండలంలో శుక్రవారం నుంచి వైఎస్సార్ ఆసరా సంబరాలు నిర్వహిస్తున్నట్లు ఏపీఎం హేమలత తెలిపారు. బుధవారం స్థానిక వైకేపీ కార్యాలయంలో షెడ్యూల్ విడుదల చేశారు. ఫిబ్రవరి 2వ తేదీ కేఎన్ పాళ్యం, ముత్తువకుంట్ల, 3న కనగానపల్లి, ఎలకుంట్ల, తగరకుంట, తూంచర్ల, వేపకుంట, 4న మామిళ్లపల్లి చంద్రశ్చర్ల గ్రామాల్లో సంబరాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

బాల కార్మికుల గుర్తింపునకు స్పెషల్ డ్రైవ్



ర్యాలీ ప్రారంభిస్తున్న ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి

అనంతపురం సిటీ: బాల కార్మికులు లేని సమాజాన్ని సృష్టించి, బాలల బంగారు భవితకు తోడ్పడుదామని ఐసీడీఎస్ పీడీ డాక్టర్ బీఎన్ శ్రీదేవి పిలుపునిచ్చారు. కలెక్టర్ ఎం.గౌతమి ఆదేశాలతో కార్మిక శాఖ, బాలల హక్కుల పరిరక్షణ సమితి, పోలీస్, సచివాలయ శాఖ ఆధ్వర్యంలో బాల కార్మికుల గుర్తింపునకు స్పెషల్ డ్రైవ్‌ను బుధవారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ పీడీ మాట్లాడుతూ.. అనంతపురంలోని రైల్వే స్టేషన్, ఆర్టీసీ బస్టాండ్, పాత ఊరు, చెరువుకట్ట, బసవన్నకట్ట తదితర ప్రాంతాల్లోని హోటళ్లు, ఇతర వ్యాపార సంస్థల్లో స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా విస్తృత తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. బాల కార్మికులను గుర్తించి వారికి పునరావాసం కల్పించాలని సూచించారు. 14 ఏళ్లలోపు బాలబాలికలను ఇంటి పనులు, వ్యాపార సంస్థల్లో పనికి పెట్టుకుంటే తీవ్రమైన నేరంగా పరిగణించి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాల కార్మికులతో పాటు వీధి బాలలను గుర్తించి సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ మేడా రామలక్ష్మి ఎదుట హాజరుపరచనున్నట్లు ప్రకటించారు. ఆమె ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. కార్మిక శాఖ సహాయ అధికారులు సుజాత, రమాదేవి, బాలల పరిరక్షణ సమితి ప్రొటెక్షన్ ఆఫీసర్ (డీసీపీఓ) మంజునాథ, ప్రొటెక్షన్ ఆఫీసర్ చంద్రకళ, లీగల్ ఆఫీసర్ సంధ్యారాణి, చైల్డ్ హెల్ప్‌లైన్ ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ కృష్ణమాచారి, సోషల్ వర్కర్ వెంకట్‌కుమార్, మహిళా కానిస్టేబుళ్లు సుజాత, ముత్యాలమ్మ, వరలక్ష్మి, మనోహర్, నాగభూషణం, చైల్డ్‌లైన్ సిబ్బంది సురేశ్, సుహాసిని, ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.